# మధుర స్మృతులు

— గంటి రమాదేవి

"**ఈ హోటలులో** నాలుగు హాల్సు ఉన్నాయి. ఒక్కో హాల్లో ఒక్కో పువ్వు పరిమళం గది అంతా వ్యాపించి ఉంటుంది. నువ్వు వెళ్ళిన తరవాత మన వూరు చాలా అభివృద్ధి చెందింది, మంజూ! నాలుగు ఎ. సి. సినిమా హాళ్ళు, దానిలో ఒకటి జంట సినిమా హాలు, ఒక 'త్రీ' స్టార్ హోటలు, రెండు 'ఎ' క్లాస్ హోటల్సు వచ్చాయి. ఈ హోటలు హోనర్ తెలివైన వాడులా ఉన్నాడు. సుగంధ చావడులు పెట్టి ప్రజల నాకర్షిస్తున్నాడు. ఒక హాలులో మల్లె సువాసన, రెండో దాంట్లో సంపంగి, మూడో దాంట్లో గులాబి, నాలుగో దాంట్లో మొగలి పువ్వుల సువాసన వచ్చే ఏర్పాటు చేశాడు. వ్యాపారంలో ఎన్నో కొత్త పోకడలు—ఒక్కసారైనా ఈ సుగంధ హోటలుకు రాకపోతే వాడు నాగరికుడే కాడన్న ధోరణి వచ్చేసింది. వూళ్ళో మిగిలిన హోటలు వాళ్ళుకూడా ఈ సుగంధం ఏర్పాట్లు చేస్తున్నట్టుగా తెలుస్తూంది. మంజూ! నువ్వు కాలేజీ నుండి 'డిబార్' అయిన తరవాత వాతావరణం అంతా డల్‌గా తయారయిం దనుకో."

స్నేహితుడిని ఇంప్రెస్ చేద్దామని హోటలు సుగంధకు తీసుకువచ్చాడు ప్రాణేశ్వరరావు. స్నేహితుడు పేరు మంజునాథ్. ఎయిర్‌ఫోర్సులో జె. టి. డబ్ల్యు. లో ఉన్నాడు. జెట్ ఫైటర్ విమానాలు నడుపుతాడు.

మంజునాథ్ వూరు విడిచి వెళ్ళిపోయి మూడేళ్ళయి పోయింది. పాత స్నేహితుడు ప్రాణేశ్వరరావును చూద్దామని అతను పని చేస్తున్న కలెక్టరు ఆఫీసుకు వెళ్ళాడు. మంజునాథ్‌ని చూడగానే ఆఫీసుకు సెలవు పెట్టి బయలుదేరాడు ప్రాణేశ్వరరావు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ బజార్లు, రోడ్లు తిరిగి, తాము చదివిన కాలేజీ భవనాలను చూసుకుంటూ, అనుభవాలు జ్ఞాపకం చేసుకుంటూ వస్తున్నారు. తాను లేకపోతే కలెక్టరు ఎంత అవస్థ పడతాడో, తనకు, కలెక్టరుకు ఉన్న సాన్నిహిత్యం, తన మాటల మీద కలెక్టరుకు గౌరవం—ఇవన్నీ చెప్పడం అయిన తర్వాత ఏదైనా హోటల్లో కాఫీ తాగుదాం రమ్మన్నాడు ప్రాణేశ్వరరావు. జీతా లొచ్చిన మొదటి వారం కాబట్టి వందా ఏభై వరకూ ఉంది జేబులో.

మంజునాథ్‌కు ప్రాణేశ్వరరావును చూడగానే చాలా సంతోషమనిపించింది. ఎయిర్‌ఫోర్సులో పనిచేస్తూ గడిచిన మూడేళ్ళలో మూడు ప్రదేశాలకు మారాడు. సాంవత్సరిక సెలవులు రెండు నెలలు (తప్పనిసరి సెలవులు రక్షక దళాలకు) తన సొంత వూరిలో గడపాలని వచ్చాడు. తనని చూడగానే ఆఫీసుకు సెలవు పెట్టి వచ్చిన ప్రాణేశ్వర్ అంటే కొత్తగా గౌరవం పుట్టింది.

ఇద్దరూ హోటలు ప్రాంగణంలో ప్రవేశించారు. పార్కింగ్ ఏరియా దాటి, గార్డెన్ సెక్షను లోంచి హోటల్ లాబీలోకి ప్రవేశించారు. చల్లటి ఎయిర్—కండిషన్డ్ గాలి బయటికే తగులుతూంది. అద్దాల తలుపులు తెరిచాడు ఎటెండెంట్, మంజునాథ్, తలుపులను చూడగానే. ప్రాణేశ్వరరావు అక్కడ నాలుగు వేపులా ఉన్న హాల్సు వైపు చూపిస్తూ అడిగాడు:

"దేనిలో ప్రవేశిద్దాం? నీ కిష్టమైన పువ్వు పేరు చెప్పు."

మంజునాథ్ నవ్వాడు. "నాకు ఏ పువ్వన్నా ప్రేమకన్న భయం ఎక్కువ."

"ఫైటర్ పైలట్‌కి భయమా? నాకు ఈ నాలుగు పూలకన్నా ఇంకో పువ్వు అంటే ఇష్టం."

"ఏమిటది?"

"నాగాభరణం. పేరెప్పుడైనా విన్నావా?"

అసలు నాకు పువ్వులంటే నీ లాగా భయం కాకపోయినా బెరుకు ఉంది. నాగాభరణం అంటే నాకు బెరుకు లేదు. మరి నీ కెందుకు పువ్వులంటే భయం?"

"ఎయిర్‌ఫోర్సులో నా ఫ్రెండొకడికి స్టార్ బోర్డు విమానం రెక్కమీద నుండి దిగుతూ కాలు విరిగింది. మా ఆస్పత్రిలో అతన్ని చూడడానికి వెళుతూ కొన్ని పూలు తీసుకు వెళ్ళాను. పేషెంట్‌ను అటెండ్ చేస్తూ డాక్టరు అన్నాడు: 'ఫ్లవర్స్ ఆర్ డెడ్లీ'— పువ్వులు చాలా ప్రమాదకరమైనవి. ఎందుకని అడిగాను. పూలలో అతి ప్రమాదకరమైన కోట్ల కొందీ సూక్ష్మజీవు లుంటాయట. బలహీనంగా ఉన్న రోగుల పైన వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుందట. 'ఆరోగ్యవంతులకు ఇవి హాని చేయలేకపోవచ్చు కాని రోగులలో ఈ పూలలో సూక్ష్మజీవులు కొత్త కాంప్లికేషన్సు తీసుకొస్తాయి' అన్నాడు. అప్పటి నుంచీ పూలు చూస్తే నాకు కొన్ని కోట్ల సూక్ష్మజీవులే కనిపిస్తాయి."

"నా భయం అటువంటిది కాదు. ఏ పువ్వు చరిత్ర చూసినా ఏమున్నది ఆనంద కారణం! మల్లె పూవుకు అగ్నిగుండం లాంటి మండు టెండలు తోడు. మల్లె అంటే నాకు నిప్పులు చెరిగే ఎండలు గుర్తు కొస్తాయి. మరి గులాబీలు...అజాగ్రత్తగా ఉంటే ముల్లు గుచ్చుకుని మన రక్తం ఎరుపు గులాబీలో కలవడం ఖాయం. మొగలిపువ్వు...పాముల పుట్టలు. అందానికి ఆశించి దగ్గరకు వెడితే మిన్నాగులు బుస్సుమంటూ మీదకు దూకుతాయి. ఇక సంపంగి... పొద సంపంగిలో పువ్వు ఎక్కడుందో కనపడదు. చిటారు కొమ్మన మిఠాయి పొట్లంలా ఎక్కడో ఉంటుంది. మరి చెట్లయితేనా! ...మనం చెట్టెక్కే లోపల అది రాలి కిందుంటుంది. సరే. ఇలా ఎంత సేపని... దగ్గరలో ఉన్న జాస్మిన్ హాలుకే వెడదాం పద."

ప్రాణేశ్వరరావు, మంజునాథ్ జాస్మిన్ హాలు తలుపులు తెరుచుకుని లోపలికి వెళ్ళారు. మంజునాథ్ సన్నగా, పొడవుగా ఉంటాడు. "క్రూ"కట్ చేసి సన్నగా మీసం పెంచాడు. జాస్మిన్ హాలులో క్రిందుగా ఉన్న 'లాంఫ్' తలకు దాదాపుగా తగులుతోంది. ప్రాణేశ్వరరావు సామాన్యంగా ఉంటాడు—మిగిలిన కలెక్టరాఫీసులో ఉద్యోగుల్లాగే.

మసగ మసగ్గా వెలుగుతూ ఉన్నాయి లైట్లు. సన్నటి సంగీతం వినబడుతోంది. 'మెనూ' కార్డు తీసి ప్రాణేశ్వర్ అడిగాడు—

"ఏం తీసుకుందాం?"

"బాగుండేదేదో ఒకటి చెప్పు."


"ఇది కన్నడ వాళ్ళ మేనేజిమెంటు. మనకి తెలియని కన్నడ వంటకాలు చాలా ఉన్నాయి. 'బిసి బేళ హుళి అన్న' అది చాలా బాగుంటుంది. అది తెప్పిద్దాం. 'బిసి' అంటే కన్నడంలో వేడి అని అర్థంట. 'బేళ' అంటే పప్పులు, 'అన్న' అంటే అన్నం... కాని హుళి అంటే ఎవరూ చెప్పలేకపోయారు."

టిఫిను పూర్తయిన తరవాత ప్రాణేశ్వరరావు మంజునాథ్‌ని అడిగాడు:

"మంజూ! నీ జీవితంలో మధుర స్మృతులు ఏమైనా ఉన్నాయా? ... నీతో ఇలా రావడం ... ఈ మల్లెల వాసన ...బిసి అన్న ... ఈ మెత్తటి సంగీతం ..."

"నన్ను కాలేజీ నుండి డిబార్ చెయ్యడమే నాకు పెద్ద మధుర స్మృతి. ఆ రోజు అలా చేయక పోయినట్టయితే, ఏ గుంటూరులోనో, వరంగల్లులోనో, బెంగుళూరులోనో మెడిసిన్ ఆఖరి సంవత్సరం చదువుతూ, డల్‌గా జీవితం గడుపుతూ ఉండేవాడిని. మా నాన్న డాక్టర్ హరిశ్చంద్ర నన్ను కూడా డాక్టరును చేయాలని నానా తంటాలు పడ్డారు. ఇంటరులో క్లాసు వచ్చినా ఎంట్రన్సులో తప్పడంతో మెడిసిన్ చాన్సు పోయింది. డొనేషను కట్టి అయినా చదివిద్దామనుకుంటే, అప్పటికే కాలాతీత మయింది. అప్పుడు మీతోబాటే సైన్సు గ్రూపులో గ్రాడ్యుయేషనులో చేరడం, కాలేజీ యూనియన్ సెక్రటరీ కావడం, సమ్మెలో టీచింగ్ స్టాఫ్ మీద దౌర్జన్యం చేశామని మమ్మల్ని అరెస్టు చేయడం, తర్వాత డిబార్ కావడం ...

ఇంటికి వచ్చేసరికి మా డాడీ అగ్గిరాముడుగా అవతారం మార్చుకుని ఉన్నాడు. నన్ను వృత్తి విద్య చదివిద్దామంటే, నేను రవుడీగా మారానని, తన వంశంలో ఇంతవరకు నాలా చెడ్డపేరు తెచ్చుకున్న వాళ్ళు ఎవరూ లేరని, ఇక తనకూ, నాకూ సంబంధం లేదని, నా దారి నేను చూసుకోవచ్చని చెప్పేశారు.




నీకు తెలుసుగా—నాది క్విక్ టెంపర్ అని. నా సర్టిఫికేట్లు, హాకీ క్రికెట్ సామాన్లు, కొన్ని బట్టలు తీసుకువస్తూ ఉంటే, అమ్మ వద్దని వారించింది, ఏడ్చింది. అయినా నేను వినలేదు. ఆ రోజు నేను కాలు అలా బయట పెట్టక పోయి ఉంటే జీవితాంతం గానుగెద్దులా, వో హాస్పిటలులో పేషెంట్లను చూస్తూ కూర్చునుండే వాడిని. మేక్—2 ( శబ్దవేగానికి రెండింతలు ) వేగంతో, నీలాకాశంలో వెళ్ళగలిగే వాడినా? ప్రొద్దున్న నాలుగు గంటలకు లేచి వ్యాయామం చేస్తాను. ఆఫీసర్ల మెస్‌లో టీ త్రాగి ఇంకా చీకటి ఉండగానే విమానంలో బయలుదేరుతాను. నేలకు ముప్పై, నలభై వేల అడుగుల ఎత్తున, 'ఎయిరో బాటెక్స్' అంటే సర్కసులో మోటారు సైకిలు వాలాలా పిల్లిమొగ్గలు వేస్తాను. ఆ ఎత్తులో ఇంజన్లు ఆపి, విమానం క్రింద పడిపోతూంటే, ఇంకా అయిదు వందల అడుగుల ఎత్తు ఉండగానే మళ్ళీ ఇంజన్లు పని చేయించడం మొదలు పెట్టి బాణంలా ఆకాశంలో దూసుకుపోతాను. ఒక గంటలో మా కమేండ్ ఏరియా అంతా తిరిగొస్తాను. పది గంటలనుంచీ క్లాసులో పాఠాలు. ఒంటిగంటకు కరకరమంటూ ఉండే మెస్సులో కమ్మని భోజనం. రెండు నుంచి నాలుగు వరకు విశ్రాంతి. సాయంత్రం నా కిష్టమైన హాకీ ఆడతాను, మా టీముతో. టీములు లేకపోతే

షటిల్‌కాక్ ఆడతాను. వారానికి ఒకసారి హోపెన్ ఎంబర్ సినిమా హాలులో సినిమాలు. నెలకో,పదిహేను రోజులకో మా ఏరియాకు దూరంగా ఉన్న సిటీలో ఎంజాయ్ చేస్తాము. నన్ను కాలేజీలో నుండి డీబార్ చెయ్యకపోయి ఉంటే ఇంత సాహసవంతమైన జీవితం నాకు చిక్కకపోయేది కదా.''

ప్రాణేశ్వరరావు, మంజునాద్ దినచర్య, అతని సాహస జీవితం ఆసక్తిగా వింటున్నాడు. ''మరి నీ జీవితంలో మధుర స్మృతులు'' అన్న ప్రశ్న విని ఉలిక్కిపడ్డాడు.

ఏమున్నాయి? బుద్ధిగా చదువుకుని, పట్టా పుచ్చుకున్నాడు. మొదట దొరికిన ఉద్యోగంలో ఆలోచన లేకుండా, మళ్ళీ దొరకదేమో నంటూ చేరి పోయాడు. పగలు ఎనిమిదికి లేవడం, స్నానం చేసి తొమ్మిదిన్నరకు భోజనం చేయడం, పదింటికి ఆఫీసుకు చేరుకోడం, ఫైళ్ళు తిరగేస్తూ, తప్పులు చేస్తూ, సూపరింటెండెంటు చేత మెత్తగాను, కలెక్టరుతో ఘాటుగా చివాట్లు తినడం, మధ్యాహ్నం తడికల క్యాంటీన్‌లో చల్లబడిపోయిన వడో, ఇడ్లో తినడం, చూరునీళ్ళ కాఫీ తాగి, కొంచెంసేపు జీతాలు, కరువుభత్యం గురించి చర్చించి, కాగితాలు ముందేసుకుని ఏదో గిలకడం, సాయంత్రం అయిదు కాగానే కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి రావడం, కాళ్ళూ ముఖమూ కడుక్కుని, సంచీ చేతికి తగిలించుకుని మార్కెట్‌కి వెళ్ళి కూరలు తేవడం, నెలకోసారి 'రష్' ఎక్కువగా లేని సినిమాకు ఒంటరిగా వెళ్ళడం, తనని కూడా తీసుకుపోలేదని, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ గోలెడితే నాలుగు చీవాట్లు— వెయ్యడం వెధవ సినిమాలూ,మీరూను—చదువూ సంధ్యాలేకుండాను. అంటూ... తన జీవితంలో మధురస్మృతులా? సెకనుకు కిలో మీటరు చొప్పున దూసుకుపోయే మంజునాద్‌కూ, అరగంటకు గాని ఆ దూరం నడవలేని తనకూ ఏం పోలిక?

వేడికాఫీ ఒక గుక్క తాగగానే ప్రాణేశ్వరరావు మెదడులో ఒక చిన్న ఆలోచన నిప్పు రవ్వలా మొదలై క్షణాలలో బ్రహ్మాండమైన అగ్నిగుండంలో మంటలా తయారయింది.'అవును ... అలా చేయాలి అనుకున్నాడు.

''మంజూ...నే నొక దురదృష్టవంతుడివి. నువ్వు డీబార్ అయిన తరవాత మన క్లాసులో రెండో సంవత్సరంలో ఒక మెరుపు తీగలాంటి అమ్మాయి చేరింది. పేరు వీణ. బాపూ బొమ్మలోని నాజూకుతనం, కరుణాకర్ బొమ్మలోని నిండుతనం కలబోసినట్టుగా బంగారు బొమ్మ లాగా ఉండేది. రెండో సంవత్సరంలో లెక్కలలో కష్టమైన కాలిక్యులస్ ప్రారంభమయింది. మొదట్లో బాగానే అర్థమయినట్టున్నా 'ఇంటిగ్రేషన్' పాఠం వచ్చే సరికి చాలామంది విషయంలో నుంచి జారిపోయారు. శ్రద్ధ ఉన్నవాళ్ళు కష్టపడి నేర్చుకున్నారు. అటువంటప్పుడే ఆ అమ్మాయితో నాకు పరిచయం అయింది. ''ఇంటిగ్రేషన్'' ఫార్ములాస్ ఎలా వచ్చాయి అనేది నన్ను చెప్పమనేది. నా లాంటి సామాన్యుడి దగ్గరకు అత్యంత సౌందర్యవతి వచ్చి అడిగేసరికి ఆనందంతో తబ్బిబ్బయ్యాను. . . ప్రైవేటుగా ట్యూషను తీసుకోవచ్చు కదా అని అడిగాను. నా ఉద్దేశం—ఆమెకు డబ్బు ఇబ్బందేమోనని. ఆ తరవాత తెలిసింది—కారులో రావడం వల్ల శరీరంలో కొవ్వు చేరుతుందని, నడిచి వస్తున్నదని. ''ట్యూషనులో శ్రద్ధ తీసుకు ఎవరూ చెప్పరు. మన అనుమానాలు చెప్పడానికి మేస్టర్ల దగ్గర భయపడతాం కాని, తోటి విద్యార్థుల దగ్గర భయపడం' కదా అంది.

అలా మా పరిచయం ఆ రెండు సంవత్సరాలు నిరంతరాయంగా సాగింది. మా మనస్సులు ఒక్కటయ్యాయి. నేను పట్టా పుచ్చుకున్న తరవాత నా కోరిక చెబుదామనుకున్నాను. కాని ఆమే అంది—పట్టా పుచ్చుకున్న తరవాత నాకు శుభవార్త అని. పెద్దలతో మాట్లాడి వివాహబంధంలో ఒకటవుదామని చెప్పింది. ఆ రోజున నేను పొందిన 'థ్రిల్' ఇంతా అంతా కాదు. మంజూ! ఆ తరవాతే కథ మరో మలుపు తిరిగింది.

పరీక్ష ఫలితాలు తెలిసే మూడు నెలల వ్యవధిలో ఎన్నో ప్లానులు వేసుకున్నాం ఇద్దరమూ. డిగ్రీ చేతికొచ్చి, నేను ఉద్యోగం వెతుక్కునే సమయంలో వీణ నా దగ్గరకు వచ్చి అంది—''ప్రాణా! నన్ను ఇక



SAA/HSI/20 TEL

ముందు నువ్వు జ్ఞాపకం చేసుకోకూడదు. మా బావతో నా వివాహం నిశ్చయమయింది. నీకుతెలుసు—మేము బాగా ఉన్నత స్థానంలో ఉన్నాం. నువ్వో డిగ్రీతో ఆపేసి గుమాస్తా ఉద్యోగమే జీవిత పరమావధిగా ఉన్నవాడివి. అంతస్తు ఉండడం నా తప్పు కాకపోయినా, అది నీకు లేకపోవడం నీ దురదృష్టం' అని వెళ్ళిపోయింది. ఇలా జరిగిన కొన్నాళ్ళపాటు మతి లేనివాడిలా తిరిగాను. చివరకు మనసు రాయి చేసుకుని ఇలా స్థిర పడ్డాను. ఏదీలేని నన్ను వీణ మనసారా కాంక్షించడమే నా జీవితంలో మధుర స్మృతి.''

సాధ్యమైనంత విచారాన్ని, మెలో డ్రామాను మేళవించి చెప్పిన ప్రాణేశ్వరరావు ''కథ''ను మంజునాథ్ విన్నాడు. చివరలో మంజునాథ్ ముఖం గంభీరంగా మారడం, అతని పిడికిలి బిగుసుకోవడం చూసి ప్రాణేశ్వరరావు తన కథ మంజునాథ్‌ని బాగా 'ఇంప్రెస్' చేసినందుకు సంతోషించాడు.

''ప్రాణా! ఆ అమ్మాయి అందరి అమ్మాయిల లాగా కాకుండా కొంచెం పొడవు ఎక్కువ కదూ!''

''అవును.''

''కళ్ళు కొంచెం తేనె రంగులో ఉంటాయా?'' కల్పించిన కథలో అమ్మాయికి మంజునాథ్ మెరుగులు పెడుతూ ఉంటే, ప్రాణేశ్వరరావు అవుననక తప్పలేదు.

''నల్లటి, వంకీలు తిరిగిన జుట్టు...''

''అవును. జడ పిరుదులు దాటుతుంది.''

''ప్రాణా! ఈ మంజునాథ్ ఉన్నంత వరకు నీ ప్రేమ విఫలం కానివ్వను. నే నింకా ఇక్కడ రెండు నెలలుంటా. ఈ రెండు నెలల్లో వీణతో నీ పెళ్ళి జరిపిస్తా.''

హోటల్లోనుండి బయటకు వచ్చిన మంజునాథ్ సుడిగాలిలా వెళ్ళిపోయాడు.

వెళ్ళి పోతున్న మంజునాథ్ తో ప్రాణేశ్వరరావు అన్నాడు—

''వీణకు అప్పుడే పెళ్ళయి ఉంటే?''

● ● ● ●

''మాధురీ! మాధురీ! వెంటనే ఇలా రా! ఏ పనున్నా వదిలేసిరా! కమ్ రైట్ అవే.''

మంజునాథ్ అరుపు అది. తన గదిలో ఏదో పుస్తకం చదువుతున్న మాధురి మంజునాథ్ కేకలకు ఉలిక్కిపడి బయటకు వచ్చింది. మంజునాథ్ తండ్రి డిస్పెన్సరీకి వెళ్ళాడు. తల్లి లోప ఢొక్కాలె ఉంది.

''ప్రేమ అంటే నీ అభిప్రాయం ఏమిటి?'' ఎందుకంత గట్టిగా అరిచాడో అర్థంకాక అయోమయంగా వస్తూ ఉన్న మాధురికి ఈ ప్రశ్న విని చిరాకేసింది.

''ఈ ప్రశ్న అడగడానికేనా ఫిరంగి పేలినట్టు అరిచావు? ఈ పైలట్లతో వచ్చిన చిక్కే ఇది. అన్నీ గాలి వేగంతో జరగా లంటారు.''

''మాధురీ! నేను వేళాకోళం చెయ్యడం లేదు. ప్రేమ అంటే నీ అభిప్రాయం?''

మంజునాథ్ ముఖం ఉద్వేగంతో ఎర్రగా అయింది. అది చూసి మాధురి గతుక్కుమంది.

''ప్రేమ...ప్రేమ....ఈ పదాన్ని ఉపయోగించకుండా బ్యాన్ చెయ్యాలి. చీమల పుట్టలా అర్థం పర్థం లేకుండా ఏదో గీకి పారేస్తున్న ఈ రచయితలని



ఫొటో_ఎల్.ఆర్.గ్యావర్

అనాలి ఈ పదాన్ని ఇంత పాపులర్ చేసినదానికి. దానికి తోడు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న సినిమాలు. టీనేజి లవ్, మిడిల్ ఏజి లవ్, ఏనిమల్ లవ్, వోల్డేజి లవ్...చాలు. ఇంకా చంటిపిల్లల లవ్ సినిమాలు రాలేదు. కథలొచ్చాయేమో!''

మంజునాథ్ ది సుడిగాలి లాటి స్వభావం. ముసుగులో గుద్దులాట సహించలేడు.

పెద్దల నిర్ణయం ప్రకారం మాధురి, మంజునాథ్‌ల వివాహం నిశ్చయమయింది. సీమటపాకాయలా చిటపటలాడే మంజునాథ్ అంటే మాధురికి ఇష్టం. రెండేళ్ళ క్రితం మాధురి తన మామయ్య హరిశ్చంద్రరావు ఇంటిలో ఉంటూ చదువుకోవడానికి వచ్చింది. మంజునాథ్ మనస్తత్త్వం బాగా తెలుసు మాధురికి. అతన్ని ఎలా చల్లబరచాలో తెలుసు. విషయం ఏదో చాలా సీరియస్ అని గ్రహించింది.

''నువ్వు బి. ఎస్ సి. రెండో సంవత్సరంలో ఈ వూరి కాలేజీలో చేరావు కదూ!'' మంజు ప్రశ్నించాడు.

''ఇంటిలో నుంచి నువ్వు వెళ్ళిపోయిన తరవాత సాయంగా ఉంటానని నను రమ్మంది అత్తయ్య.'' మాధురి జవాబు.

''మాధురీ... నీకు లెక్కలలో ఇంటెగ్రేషన్స్ బాగా వచ్చా?''

''ఆఁ ఇప్పుడేం గుర్తు లేవు.''

''గుర్తు లేవు. చాలా సులభంగా మరిచిపోయింటావ్. నీకు ప్రాణ తెలుసా?''

సూక్ష్మగ్రాహి మాధురి. మగవాడి మనసులో కోపానికి అసలు కారణం ఈర్ష్య. అడిగినది కాదంటే అవునన్నట్టే వాళ్ళ దృష్టిలో.

''ప్రాణ...'' జ్ఞాపకం తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా అంది.

''ప్రాణేశ్వరరావు. లెక్కలలో జీనియస్.''

ప్రాణేశ్వరరావు ఎవరో మాధురికి తెలియదు. మళ్ళీ మంజునాథ్ అన్నాడు.

''వి పేరు వీణ అని చెప్పాడు. బహుశా నువ్వు నీ పూర్తి పేరు చెప్పి ఉండక పోవచ్చు అతనికి, ''వీణామాధురి'' అని. లెక్కల పాఠాలు చెప్పేవాడు నీకు అప్పట్లో. అతనితో కలిసి తిరిగావు నువ్వు. ఎన్నో మధురమైన బాసలు చేసుకున్నారు.''

మాధురి అనుమానం నిజమయింది. చల్లగా ఉంటుంది పెట్రోలు నిప్పు తగిలేంతవరకూ. తరవాత? ఇటువంటి సమయంలో నేర్పుగా ప్రవర్తించాలి అనుకుంది.

''అవునౌ, బావా? పూర్ చాప్. ఏం చేస్తున్నాడిప్పుడు?''

తనకి నిజంగా తెలియక పోయినా, ఆ ప్రాణేశ్వరరావెవరో తెలుసని చెప్పింది. ప్రాణేశ్వరరావు తనకి తెలుసనగానే మంజునాద్ ముఖంలో రౌద్రం పోయి మామూలు ప్రశాంతత వచ్చేసింది.

''స్థితిమంతుడు కాదని అతన్ని కాదన్నావ్? అవునా?''

''ఎ... ఆ... ఇ... అదీ...''

ఏం చెప్పాలో తెలియక మాధురి...

''అ ఆ ల బరి అప్ప చెప్పకు.''

బయటకు వెళ్ళి పోతున్న మంజునాథ్‌ను అడిగింది.

''బావా! ఎక్కడికి? ప్రాణేశ్వరరావ్ ఎవరు?''

''ఇంకో వారంలో తెలుస్తుంది... వీణామాధురీ.''

వెక్కిరింతగా అంటూ వెళ్ళిపోయిన మంజునాద్ వైపు అవాక్కయి చూస్తూ అనుకుంది మాధురి. ''ఇంకో వారంలో ఏమవుతుంది?'' అని

● ● ●

వారం గడిచింది.

కలెక్టరు వారం రోజులు క్యాంపు కెడుతూ వారం రోజులు సరిపడా ''పెట్టె'' వెళ్ళాడు ప్రాణేశ్వరరావుకి. ఏవో స్టేటుమెంట్లు తయారు చెయ్యాలి. అంకెలు గ్రామాల నుంచి రాలేదు. వచ్చినవి ఏయే సీట్ల దగ్గర ఫైలయ్యాయో తెలియదు. అలోచిస్తున్న ప్రాణేశ్వరరావు ఆఫీసు ముందు మంజునాథ్ కారు ఆగడం చూశాడు. జేబులో డబ్బులు చూసుకున్నాడు. పన్నెండు రూపాయలుంది. గబగబా పక్క సీటు బిల్ పాసింగ్ గుమాస్తా నడిగి ఇరవై తీసుకుని భద్రపరిచాడు.

''మంజూ! వారం రోజుల నుంచి కనపడటం లేదు.'' ప్రాణేశ్వరరావు లోపలికి వచ్చిన మంజునాద్‌ని ఉద్దేశించి అన్నాడు.

''అవన్నీ తరవాత మాట్లాడుకుందాం. ఇప్పుడు టైము లేదు. నా టైమ్ ఎట్ మై డిస్పోజల్ ఈజ్ వెరీ షార్ట్.''

''ఆఫీసు టైము ఇంకా అవలేదు.

ప్రాణేశ్వరరావు అంటున్న మాటలు వినకుండా జబ్బ పట్టుకుని లాక్కుపోయాడు మంజునాద్. కారులో కూర్చుంటూ అడిగాడు ప్రాణేశ్వరరావు.

''ఎక్కడికి?''

''హోటల్ సుగంధ. అక్కడ నీ కోసం ఒక శుభాశ్చర్యకర వార్త ఎదురు చూస్తూ ఉంటుంది.''

హోటల్ సుగంధలో ''రోజ్, హాలు మాధురి, మంజునాద్, ప్రాణేశ్వరరావు కూర్చుని ఉన్నారు. మంజునాథ్ అన్నాడు నవ్వుతూ:

''విడిపోయిన ప్రేమికులకు స్వాగతం. మాధురీ... పాణా... అలా ఎప్పుడూ చూసుకోనట్టే ఉన్నారే?

ఇక నటనలు చాలు.''

కారులో తనని రమ్మన్నప్పుడు మంజునాద్ ఎక్కడికని అడిగితే ఏమీ చెప్పలేదు. కలెక్టరు ఆఫీసు దగ్గర ఆగినప్పుడు ఎందుకని అడిగితే చెప్పలేదు. ఇప్పుడెవరినో తీసుకు వచ్చి ప్రేమికు డంటాడేమిటి? వీడేనా ప్రాణేశ్వరరావంటే.... ఎప్పుడూ చూసిన గుర్తు లేదే...

మాధురి ఆలోచనలు పొగమంచులా ఆమె మనసును కప్పేసింది.

దాదాపు అదే స్థితిలో ఉన్నాడు ప్రాణేశ్వరరావు. రూబీ చుక్కల చీరలో చుక్కలా మెరిసి పోతున్న ఆ అమ్మాయి మంజునాద్ లెవెల్లో ఉన్న మనిషి. అటువంటి వాళ్ళను యాధాలాపంగా చూస్తాడు ప్రాణేశ్వర్ ఇంకో లోకం మనిషిని చూసినట్టు. ప్రేమికులంటూ దేమిటి? వీణతో నీ పెళ్ళి జరిపిస్తా అని వెళ్ళిన వాడు ఇలా దుమారంలా వచ్చి నటనలు చాలు అంటాడే? తన కథలో వీణ ఈమె కాదు కదా!

మంజునాథ్ తన గురించి గొప్పగా అనుకోవాలని కథ అల్లితే, అది కొంప ముంచేటట్టుందే. ఇదెక్కడి చిక్కురా,బాబూ. కలెక్టరు చెయ్యమన్న స్టేట్‌మెంట్లు ఏమవుతాయో, దేముడా! వీణ... ప్రేమ... కథ. నా బొంద..

మంజునాద్ మనసులో దుమారం అది.

మాధురిని, ప్రాణేశ్వరరావుని మార్చి మార్చి చూస్తున్న మంజునాద్ ఎక్కడో తను పొరపడ్డానని గుర్తించాడు. వీళ్ళిద్దరికీ అసలింతకు ముందు పరిచయం ఉన్నట్టు లేదు. ఇద్దరిలో కొంచెం కూడా ఒకరి నొకరు గుర్తించిన భావం లేదు.

బ్రీఫ్‌కేసులో నుంచి పుస్తకం సైజులో ఉన్న కార్డుల కట్ట తీశాడు. ఆ కట్టలోంచి రెండు కార్డులు తీసి ఇద్దరికీ ఇచ్చాడు.

'వీణ వెడ్స్ ప్రాణే...'


ఇంకా ఏదేదో ఉంది. ప్రాణేశ్వరరావు ఫోటో ఒక ప్రక్క, మాధురి ఫోటో ఒక ప్రక్క ... కుర్చీలో కట్టేసి, ఎత్తునుంచి ఇనుపగుళ్ళు సరిగ్గా నెత్తి మీద, కొంచెం వ్యవధితో పడేటట్టు చేస్తే కలిగే బాధ కనిపించింది మాధురిలో. మండు టెండలో మంచు గుళ్ళు తగిలినట్టు ఆశ్చర్యం—ప్రాణేశ్వరరావులో. విచిత్రమైన అనుభూతికి లోనవుతున్నారిద్దరూ. వీణ వెడ్స్ ప్రాణ ... వ్హాట్?

• • • •

''నిన్ను మెప్పించాలని, నీ సానుభూతి పొందాలని నీకో కథ కల్పించి చెప్పాను. నా నిస్సారమైన జీవితం నీకు తెలియకూడదని గొప్పలు చెప్పాను. నిజానికి ఆ వీణ ఎవరో నాకు తెలీదు.'' ప్రాణేశ్వరరావు చెప్పాడు బాధగా.

''మరి వీణ అంటే ఈ వీణా మాధురి మన కాలేజీలోనే చదివింది. లెక్కల గ్రూప్... రెండో సంవత్సరంలో చేరింది. మెరుపుతీగ ... తేనె కళ్ళు... అందుకనే నేను నిజమని నమ్మాను. స్నేహితుడివైన నిన్ను సంతోష పెడదా మనుకున్నాను...'' మంజు వివరిస్తూ అన్నాడు.

'మంజూ ... నేను సెక్షను 'ఎ' లో ఉండేవాడిని.



ఫోటో: శ్రీనివాసన్

మరి మిస్ వీణ ఏ సెక్షనో నాకు తెలియదు.''

మాధురి అంది —

''నాది సెక్షన్ 'సి'. బావ డిబార్ అయి వెళ్ళి పోయిన సంవత్సరమే నేను మీ కాలేజీలో చేరాను.''

''తేనె కళ్ళు వగైరా వర్ణనలు కాకతాళీయం కావచ్చు. మిగిలినది నువ్వే చెప్పావ్. నేను ''వూ'' అన్నాను. మంజూ! పెళ్ళి అన్న తర్వాత పెద్దవాళ్ళతో మాట్లాడడం వగైరా చెయ్యాలి. తొందరపడి కార్డులుకొట్టించేశావ్.నాఫోటోఎక్కడ దొరికింది.?'' తన సందేహం బయటపెట్టాడు ప్రాణేశ్వరరావు.

''పెద్దవాళ్ళతో మాట్లాడితే ఈ పెళ్ళి జరగదని నాకు తెలుసు. మీ రిద్దరూ ఇష్టపడ్డారు. మీ రిద్దరూ మేజర్లే. ఎంతమందినైనా ఎదిరించి ఈ పెళ్ళి చేయాలనుకుంటున్నాను. మిమ్మల్ని ఆశ్చర్యంతో ముంచెత్తాలని ఇలా చేశాను. నీ ఫోటో సంపాదించడం కష్టమైన పనేంకాదు నాకు ...''

మంజునాథ్ మాటల్ని మధ్యలో ఆపి అన్నాడు ప్రాణేశ్వరరావు.

''జరిగింది మర్చిపో, మంజూ...ఇంకా నయం— ఈ వెడ్డింగ్ కార్డులు ఇంకా అందరికీ పంచలేదు.''

''ప్రాణా! పరిస్థితి నా చెయ్యి దాటిపోయింది. ఈ సుగంధ హోటలులో మేరేజీ హాలు బుక్‌చేశాను. ఎల్లుండి పెళ్ళి. కార్డులన్నీ పోస్ట్ చెయ్యడం జరిగి పోయింది. ఇవి నీ కివ్వాలని, నీ స్నేహితులకు, బంధువులకు పంచుతావని తెచ్చాను.''

''శుభలేఖలు అందరికీ పంచేశావా? ... ఎల్లుండే పెళ్ళా ...''

మాధురి, ప్రాణేశ్వరరావు ఇద్దరూ ఒకేసారి అరిచారు.

''ఇప్పుడేం చెయ్యాలి? అవమానంపాలు కాకుండా ఈ సమస్య నుండి తప్పుకోవడం ఎలా?''

ముగ్గురిలోనూ ఒకే ప్రశ్న...

భగవంతుడా! మాకోదారి చూపించు. మవునంగా ప్రార్థించింది మాధురి.

శుభలేఖలు అందరికీ ముట్టిపోతాయి. బంధువులు తన తండ్రిని అడుగుతారు మాధురిని వేరే ఎందుకిస్తున్నారని? తనకి తెలీదంటాడు తండ్రి. ఇదివరకు తను కాలేజీలో డిబార్ అయినందుకే చాలా బాధపడ్డాడు. ఇలాంటి తొందరపాటు పని తనెందుకు చెయ్యాలి? బంధువులలో, స్నేహితులలో తను, తన కుటుంబం, ముఖ్యంగా మాధురి అవమానంతో తలెత్తుకోలేరు. మంజునాథ్ మనస్సులో తుఫాను రేగుతోంది. రేపటిలోపల ఏదో చెయ్యాలి! ... ఏదో చెయ్యాలి! !

• • • •

చిన్న ముసురుగా ప్రారంభమయిన వాన కుండపోతగా మారింది. విసురుగా గాలి ... కెరటాలు కెరటాలుగా మేఘాలు వాన కుమ్మరించేస్తున్నాయి. సిగరెట్టు మీద సిగరెట్టువెలిగిస్తున్న మంజునాద్ బయట పడుతున్న వానని నిర్లిప్తంగా చూస్తున్నాడు.

గాలి ఎక్కువవుతోంది.

ఇలా ఇంకా సాయంత్రం వరకు ఉంటుందని రేడియో వార్త.

వంగిపోతున్న కొబ్బరి చెట్టుపైన మెరుపు మెరిసింది.

తుఫాను చూడగానే మంజునాథ్‌లో తళుక్కున మెరిసిం దో ఉపాయం.

వాన, గాలి లెక్కచేయకుండా మంజునాథ్ కారు సిటీ వైపు దూసుకుపోతూ ఉంది.

దిన పత్రిక ఆఫీసులో రేపటి ఎడిటోరియల్ కంపోజు అవుతోంది

''ఎంతయినా ఫర్వాలేదు ... ఈ ప్రకటన మొదటి పేజీలో పెద్ద అక్షరాల్తో వేయించండి.''

''తుఫాను కారణంగా ... వీణ, ప్రాణ వివాహం వాయిదా వేయడమైనది. కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం.''

కుడిచేతివైపు క్రిందుగా ప్రకటించబడవలసి ఉన్న ప్రకటన స్థానే మంజునాద్ ప్రకటనను వేయడానికి ఒప్పుకున్నాడు ఎడ్వర్టయిజమెంట్ మేనేజర్.

ప్రకటనకు ఇవ్వవలసిన డబ్బు ఇచ్చి, రసీదు తీసుకుని బయటకు వచ్చిన మంజునాద్‌కు బయట తుఫాన్ బీభత్సం ఎంతో అందంగా కనిపించింది. తుఫానులాంటి తన సమస్యను తుఫాను కాపాడింది. తుఫాను ...

• • • •

ఎయిర్‌ఫోర్స్ ఫామిలీ క్వార్టర్సులో సామాన్లు సర్దుతూ, క్రిందపడ్డ శుభలేఖలు చూసి శ్రీ మంజునాథ్, శ్రీమతి మంజునాద్ అదిరిపడ్డారు.

శ్రీమతి మంజునాద్ అడిగింది:

''ఎవరివండీ ఈ శుభలేఖలు ...''

''మా స్నేహితుడు ప్రాణేశ్వరరావుకి వీణ అనే లతడి ప్రేమికురాలి పెళ్ళి శుభలేఖలు ...''

''మన కెందుకు? బాయిలర్లో పడేస్తా ...'' మండుతున్న బాయిలర్లో పడేయాలని వెడుతూఉన్న శ్రీమతి మంజునాద్‌ను వారిస్తూ కంగారుగా అన్నాడు మంజునాథ్.

''మాధురీ! నాటిని కాల్చకు ...''

''ఏం? ...''

''వీణామాధురీ ... మా ఉత్తుత్తి పెళ్ళి నీ పిల్లలకు చూపించాలిగా...''

''అప్పుడు వాళ్ళ నాన్న తెలివితేటలు వాళ్ళకి తెలుస్తాయి ...''

వెక్కిరింపుగా మాధవి అంది.

''మాధవీ ... ఎవరికీలేని, నీకు, నాకు మాత్రమే తెలిసిన మధురస్మృతి అది.'' ★